షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448


# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 254 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 26 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 254 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 26 july 2024 PAGES : 8 PRICE : 5/-



## జగన్ ప్రభుత్వ హయాంలో దయనీయంగా

# శాంతి భద్రతలు

- శాంతి భద్రతలపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- వైకాపా హయాంలో ప్రతిపక్ష నేతలే టార్గెట్
- నాపై 17 కేసులు, పవన్‌కల్యాణ్‌పై 7 కేసులు, జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 60కి పైగా కేసుల నమోదు
- రఘురామకు చిత్రహింసలు.. ఆ వీడియోలు చూసి జగన్ పైశాచికానందం
- శాంతి భద్రతల విషయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం

**అమరావతి**

శాంతిభద్రతల విషయంలో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ ప్రేరేపిత కేసులపై సమీక్షిస్తామని, అక్రమ కేసులు పెట్టిన అధికారులను శిక్షించేందుకు సిద్ధమని ప్రకటించారు. శాసనసభలో 'శాంతిభద్రతలపై శ్వేతపత్రం' విడుదల సందర్భంగా సీఎం మాట్లాడారు. లా అండ్ ఆర్డర్‌పై మరింత లోతుగా చర్చించాలని, మరో సెషన్ నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరగా.. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఎన్డీయే సభ్యులు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పరిస్థితి తీసుకురావొద్దని సీఎం సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా శిక్షిస్తామన్నారు. అధికారులు చట్టాన్ని గౌరవించినప్పుడే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో దయనీయంగా మారిన శాంతి భద్రతలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం అయిదు అంశాలుగా శ్వేతప త్రాన్ని విభజించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు శాంతి భద్రతలను చాలా చక్కగా మెయింటెయిన్ చేశారన్నారు. గతంలో రాయలసీమలో - మిగతా3లో



## దేశంలోనే ఈవేస్ట్‌లో

# ఏపీ 12వ స్థానం

- ఈ వేస్ట్ రిసైక్లింగ్ కోసం రాష్ట్రంలో ఆరు కేంద్రాలున్నాయి
- కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు రీసైక్లింగ్ చేస్తున్నాం
- పెరుగుతున్న ఈ వేస్ట్‌కు అనుగుణంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ రీ సైక్లింగ్ సెంటర్స్ రావాలి
- ఈ-వ్యర్థాల తొలగింపుపై ప్రశ్నించిన ఎమ్మెల్సీలు... సమాధానమిచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- శాసనమండలికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**అమరావతి**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యావరణ శాఖను కూడా చేపట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ ఆయన శాసనమండలికి హాజరయ్యారు. ఈ-వ్యర్థాల తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీలు ప్రశ్నించగా, పవన్ కల్యాణ్ సమాధానమిచ్చారు. దేశంలో ఈ-వ్యర్థాలు అధికంగా ఉత్పత్తి - మిగతా3లో



## ఉచిత పథకాల పేరిట భావితరాలపై భారం మోపొద్దు

- తేల్చి చెప్పిన విత్త మంత్రి నిర్మలమ్మ..!
- వివిధ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఉచిత పథకాల్లో స్థిరత్వం తేవాల్సిన అవసరం ఉంది
- ఉచిత పథకాలను ఈనాడు సమర్ధించుకోవచ్చు
- కానీ ప్రజాభిప్రాయం ప్రకారం పన్నుచెల్లింపుదారులకు జవాబుదారీగా ఉండాలి
- మీరు కొందరు వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేసి మరికొందరికి ఇస్తున్నారు.

## పోలవరం జాప్యానికి

# జగన్ కారణం



- పార్లమెంట్ సాక్షిగా స్పష్టం చేసిన కేంద్రం
- పోలవరం నిర్మాణం ఆలస్యానికి కారణం
- కాంట్రాక్టర్‌ను మార్చడమే
- పోలవరంపై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్రం
- పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తాం
- మూడేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు రూ.8,044.31 కోట్లు ఇచ్చామని స్పష్టం
- మూడేళ్లలో పోలవరం కాంక్రీటు పనుల్లో కేవలం 5.03 శాతం జరిగాయి

**ఢిల్లీ**

పోలవరం జాప్యానికి కారణం మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డే నని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం స్పష్టం చేసింది. ఈ న్యూస్ ఏపీలో సంచలనంగా మారింది. ఇప్పటి వరకూ కేంద్రంపై నెపం నెడుతూ వచ్చిన జగన్‌కు రివర్స్‌లో కేంద్రం గట్టి షాకే ఇచ్చింది. మొత్తం జగనే చేశారని కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ లోక్‌సభలో ఇవాళ స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వ వైఫల్యమే పోలవరం జాప్యానికి కారణమని సీఆర్ పాటిల్ వెల్లడించారు. లోకసభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు హరీష్‌లు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పై విధంగా సమాధానం చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడానికి గుత్తేదారును మార్చడం కారణం అని కూడా కేంద్రం స్పష్టం చేసింది. లోకసభలో టీడీపీ - మిగతా3లో



## భారత్‌లోని ఈ నగరాలకు

# వెళ్లకూడదు

- దేశ పౌరులకు అమెరికా హెచ్చరికలు జారీ
- మణిపుర్, జమ్ము కశ్మీర్, భారత్-పాకిస్థాన్ సరిహద్దులతో పాటు మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్న మధ్య, తూర్పు భారత దేశ ప్రాంతాలకు వెళ్లొద్దు
- దేశంలో పెరిగిపోతున్న నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- భారత్-పాకిస్థాన్ సరిహద్దులోని 10 కి.మీల పరిధిలో కాల్పులు జరిగే అవకాశం ఉంది
- తూర్పు లద్దాఖ్ ప్రాంతం, లేహ్ మినహా కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదం పేట్రేగుతోంది

# రైతులను ఆదుకోవాలి



- ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన షర్మిల
- ఇటీవల ఏపీలో భారీ వర్షాలు
- వరదలతో రైతాంగం అతలాకుతలం అయిందన్న షర్మిల
- గత ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఆరోపణ

**అమరావతి**

ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ముఖ్యంగా, కోస్తా జిల్లాల్లో వర్షాలు, వరదలతో రైతులు అతలాకుతలం అయ్యారని తెలిపారు. కాలం చెల్లిన, అస్తవ్యస్తంగా మారిన కాలువల నిర్వహణ కారణంగా పంట పొలాలు నీట మునిగాయని, తీవ్ర స్థాయిలో పంట నష్టం జరిగిందని షర్మిల - మిగతా3లో




## పరీక్షల నిర్వహణలో కీలక మార్పులకు శ్రీకారం

- అభ్యర్థులకు ఆధార్ అథెంటికేషన్, ఫేషియల్ రికగ్నిషన్..!
- యూజీ పేపర్ లీక్ అంశం దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే
- పరీక్షల నిర్వహణలో అధునాతన డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని నిర్ణయం
- ఎక్కడా ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని యూపీఎస్సీ యోచన

## డోంట్ వర్రీ అమ్మా...

# నేను చూసుకుంటా:

- ఒమన్‌లో కష్టాలు పడుతున్న మామిడి దుర్గకు మంత్రి నారా లోకేశ్ భరోసా
- ఒమన్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన ఏపీ యువతి మామిడి దుర్గ
- ఆరోగ్యం బాగాలేదంటూ కన్నీటి పర్యంతం
- నువ్వే కాపాడాలన్నా అంటూ లోకేశ్ కు విజ్ఞప్తి
- వెంటనే స్పందించిన నారా లోకేశ్



**అమరావతి**

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతిలో మోసపోతున్న వారు తిరిగి రాలేక, అక్కడ ఇమడలేక అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు తమ గోడును వీడియోల రూపంలో వెళ్లబోసుకోగా, ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇటీవలే చొరవ చూపి కువైట్ నుంచి శివ అనే కార్మికుడిని స్వస్థలానికి రప్పించారు. తాజాగా, మామిడి దుర్గ అనే యువతి కూడా ఇదే రీతిలో ఒమన్ లో చిక్కుకుపోయి - మిగతా3లో

# పోలవరం జాప్యానికి జగన్ కారణం

-మొదటిపేజీ తరువాయి

పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2021లో ఐఐటీ హైదరాబాద్ (%ఎఎసవతీఖుఎఖుస%) ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టు ఆలస్యానికి కారణాలు పేర్కొనడం జరిగిందని కేంద్ర మంత్రి (%జవత్‌తీఖుశ్రీ వీఱఅఱర్‌వతీ%) స్పష్టం చేశారు. గుత్తేదారును మార్చడంతో పాటు... భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రాజెక్టు తొలిదశ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని పార్లమెంటుకు జలశక్తి శాఖ చెప్పింది. గత మూడేళ్ళలో రూ. 8,044.31 కోట్లు కేంద్రం నుంచి ఇచ్చినట్లు సీఆర్ పాటిల్ తెలిపారు. మూడేళ్ల పనుల పురోగతి వివరాలను కూడా సమాధానంలో పొందుపరిచారు.

2021-22 నుంచి మూడేళ్ళలో ప్రాజెక్టు ప్రధాన పనుల్లో 21శాతం మట్టి పనులు, కాంక్రీటు పనులు కేవలం 5.3 శాతం జరిగాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కుడి కాలువకు లైనింగ్ పనులు 1.72 శాతం, స్ట్రక్చర్స్ 0.39 శాతం జరిగాయన్నారు. ఎడమ కాలువకు మట్టి పనులు 0.30 శాతం, లైనింగ్ 1.18 శాతం, స్ట్రక్చర్స్ 3.33 శాతం జరిగాయన్నారు. భూసేకరణ 0.22 శాతం, సహాయ పునరావాస కార్యక్రమం 8 శాతం జరిగిందని వివరాలను కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రాజెక్టు పనుల పరిశీలన, ఆలస్యానికి కారణలు తెలుసుకోవడానికి 2021 ఆగస్టు లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఐఐటీ హైదరాబాద్ నుంచి సహకారం తీసుకున్నట్లు సీఆర్ పాటిల్ తెలిపారు.



పల్నాడు పరిస్థితి దారుణం: లావు శ్రీకృష్ణదేవరాయలు

పల్నాడు జిల్లాలో నీటి సమస్య తీవ్రస్థాయిలో ఉందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నేడు లోక్ సభలో మాట్లాడుతూ వెల్లడించారు. పల్నాడులో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, కేంద్రం రూ.350 కోట్ల మేర నిధులు ఇచ్చినా, గత ప్రభుత్వం వాటిని ఖర్చు చేయలేదని ఆరోపించారు. కనీసం ఇతర ప్రాంతాల నుంచి పల్నాడుకు నీళ్లు తరలించాలన్న ఆలోచన కూడా గత ప్రభుత్వం చేయలేదని అన్నారు.

నీళ్లు లభించే ప్రాంతాల నుంచి నీటి తరలింపుపై కేంద్రం చర్యలు తీసుకోవాలని లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ స్పందించారు. శ్రీకృష్ణదేవరాయలు లేవనెత్తిన అంశం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని పేర్కొన్నారు. ఇది ప్రత్యేకంగా చూడాల్సిన అంశం అని అన్నారు.

# జగన్ ప్రభుత్వ హయాంలో దయనీయంగా శాంతి భద్రతలు

-మొదటిపేజీ తరువాయి

ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశామని చెప్పారు. సీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేయాలని చూశామని.. ఆ క్రమంలో చివరకు తమ పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు ఇద్దరిని అరెస్ట్ చేసిన తర్వాత మిగిలిన వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. తద్వారా రాయలసీమలో ఫ్యాక్షనిజం లేకుండా చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

**హైదరాబాద్‌లో మత ఘర్షణలపై ఉక్కుపాదం..**

అలాగే హైదరాబాద్‌లో మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణిచి వేశామన్నారు. దీంతో మత సామరస్యానికి వేదికగా హైదరాబాద్‌ను నిలిపామని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు.. వామపక్ష తీవ్రవాదాన్ని సైతం గ్రేహౌండ్స్ ద్వారా అదుపులోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేశామన్నారు.

**సాంకేతికతతో శాంతి భద్రతలు..**

ఇక రాష్ట్రంలో ఎక్కడైనా రౌడీయిజం కనిపిస్తే.. దానిని సైతం ఉక్కుపాదంతో అణిచి వేశామని తెలిపారు. తమ ప్రభుత్వం చర్యల వల్ల ప్రజల్లో భద్రత పెరిగి ప్రతి ఒక్కరిలో ఓ నమ్మకం అయితే వచ్చిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోని శాంతి భద్రతలను కాపాడామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు.

**అందుకే కూటమికి పట్టం..**

ఇటీవల లోక్‌సభతోపాటు ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఓటరు.. ఎన్డీయే కూటమికి పట్టం కట్టాడు. దీంతో రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరింది. అయితే గత జగన్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, ఆర్థికాభివృద్ధే కాదు.. శాంతి భద్రతలు సైతం క్షీణించాయి. ఈ నేపథ్యంలో దాదాపు ప్రతి రంగంపై చంద్రబాబు ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని నిర్ణయించింది. అందులోభాగంగా రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులపై సీఎం చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేశారు.

రఘురామకు చిత్రహింసలు.. జగన్ పైశాచిక ఆనందం

%అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామరాజును అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ రోజు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాంతి భద్రతలపై శ్వేతప్రతం విడుదల చేస్తున్న తరుణంలో ఈ ప్రస్తావన తీసుకొచ్చారు. లాకప్‌లో చిత్రహింసలు పెడుతున్న వీడియోను చూసి నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చూసి పైశాచిక ఆనందం పొందారని విమర్శించారు. రఘురామను సొంత నియోజకవర్గానికి వెళ్లకుండా చేశారని ధ్వజమెత్తారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక తనపై 17 కేసులు పెట్టిందని తెలిపారు. ఈరోజు (గురువారం) అసెంబ్లీలో ముఖ్యమంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. పోలీస్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందని మండిపడ్డారు. బాబ్లీ కేసు తప్ప తనపై గతంలో ఎప్పుడూ కేసులు లేవని స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై 7 కేసులు పెట్టారని గుర్తుచేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని విమర్శించారు. కక్ష సాధింపు చర్యలకు గతంలో పోలీసులు ఆయుధంగా మారారని, ప్రభుత్వంతో పోలీసులు కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు.

వైసీపీతో విభేదిస్తే పోస్టింగ్‌లు ఉండవు

వైసీపీ నేతలతో విభేదిస్తే పోస్టింగ్‌లు ఉండవు.. వీఆర్‌లో ఉంచేవారని తెలిపారు. ఐదేళ్లపాటు వీఆర్‌లో ఉన్న అధికారులు కూడా ఉన్నారని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విపక్ష నేతలను అణచివేసే కుట్ర చేశారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై 60కి పైగా కేసులు పెట్టారని, పల్లా శ్రీనివాసరావు ఇంటిని కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పులివెందులలో పోటీ చేసిన రవీంద్రనాథ్‌ను జైల్లో పెట్టారన్నారు. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ.. ధూళిపాళ్ల నరేంద్రను జైలులో పెట్టారని చెప్పారు. ప్రభుత్వ అధికారులపై దాడుల నెపంతో కూన రవికుమార్‌పై కేసు పెట్టారని తెలిపారు.

మహిళలపై అసభ్యకర పోస్టులు

"మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారు. ఫర్నీచర్ దుర్వినియోగం చేశారని దివంగత నేత కోడెల శివప్రసాదరావుపై 18 కేసులు పెట్టారు. అవమాన భారంతో బతకలేక కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. నాటి సీఎం జగన్ ఇంట్లో ఇప్పటికి కూడా ప్రభుత్వ ఫర్నీచర్ ఉంది. వంగలపూడి అనితపై అట్రాసిటీ కేసు పెట్టారు. అయ్యన్న పాత్రుడుపై అట్రాసిటీ, అత్యాచారయత్నం కేసు పెట్టారు. అచ్చెన్నాయుడు ఆరోగ్యం సరిగా లేకున్నా 600 కి.మీ. వాహనంలో తిప్పారు" అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

తప్పుడు రాజకీయాలు చేస్తే సహించం..

"సంబంధం లేకపోయినా పేపర్ లీక్ అయిందని నారాయణపై కేసు పెట్టారు. న్యాయమూర్తుల పైనా ఫేక్ పోస్టులు పెట్టారు. టీడీపీ, జనసేన కార్యాలయాలపై దాడులు చేశారు. జై జగన్ అనలేదని తోట చంద్రయ్యను చంపారు. వైసీపీ ప్రభుత్వం అక్రమంగా జీవో1 తీసుకువచ్చింది. టీడీపీ నేతలపై 591 కేసులు పెట్టారు, 162 మందిని అరెస్ట్ చేశారు. మా కార్యకర్తలపై1969 కేసులు పెట్టారు, 2370 మందిని అరెస్ట్ చేశారు. జనసేన నేతలు, కార్యకర్తలపై 206 కేసులు పెట్టారు. సొంత చెల్లి షర్మిలపై కూడా 2 కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలు విఫలమయ్యాయని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపుతున్నారు. లా అండ్ ఆర్డర్ సక్రమంగా నిర్వర్తించడం మా బాధ్యత. తప్పుడు రాజకీయాలు చేస్తే సహించం" అని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సామాజిక కోణంలోనే విప్‌ల భర్తీ

**విజయవాడ :** ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. పాలనలో తన మార్కు చూపిస్తోంది.మరోవైపు సంక్షేమ పథకాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పింఛన్లను పెంచి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కేంద్రం సైతం బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది.మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు సైతంతమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఇప్పటికే 50 రోజుల పాలన సమీపిస్తుంది. చంద్రబాబు చాలా రకాల నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే విప్పులను కూడా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీఫ్ విప్ తో పాటు ఏడుగురు విప్ లను నియమించాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఈరోజు దీనిపై అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. జనసేన పార్టీ తరఫున ఒక బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు విప్ పదవి ఇవ్వాలని చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఏపీలో మూడు పార్టీలు కలిపి కూటమి కట్టాయి. ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకున్నాయి. సుదీర్ఘకాలం ఈ పొత్తు కొనసాగాలని మూడు పార్టీలు కోరుకుంటున్నాయి. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినందున.. నామినేటెడ్ పదవులతో పాటు ఇతర అంశాల్లో మూడు పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అందులో భాగంగా చీఫ్ విప్ తో పాటు ఏడుగురు విప్ లను.. మూడు పార్టీల నుంచి ఎంపిక చేయనున్నట్లు సమాచారం. బిజెపి కి సంబంధించి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే



విష్ణుకుమార్ రాజును విప్ గా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి నుంచి కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు, ఒక బీసీ, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించినట్లు సమాచారం. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రకటన కూడా ఈరోజు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. చీఫ్ విప్ రేసులో టిడిపి నేతలు బీటీ నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, జీవి ఆంజనేయుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి ఛాన్స్ దక్కొచ్చని తెలుస్తోంది. అయితే జనసేనతో పాటు బిజెపి సైతం చీఫ్ విప్ పదవి కోరుతున్నా.. టిడిపి మాత్రం విడిచి పెట్టే ఛాన్స్ కనిపించడం లేదు.శాసనమండలి నుంచి చీఫ్ విప్ ను ఎంపిక చేస్తే.. బీటీ నాయుడు పేరు ప్రతిపాదనలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం బీటీ నాయుడు కర్నూలు టిడిపి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ధూళిపాళ్ల నరేంద్ర మంత్రి పదవి ఆశించారు. పొన్నూరు నుంచి టిడిపి ఎమ్మెల్యేగా ఆరోసారి గెలిచారు. 1994లో తొలిసారిగా పోటీ చేసి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటినుంచి 2014 వరకు వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. 2019లో మాత్రం కిలారి వెంకట రోశయ్య చేతిలో ఓడిపోయారు. ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణ పై 32 వేల మెజారిటీతో గెలిచారు. మంత్రి పదవి ఆశించారు. కానీ వివిధ సమీకరణల నేపథ్యంలో ఆయనకు పదవి దక్కలేదుటిడిపి సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సైతం చీఫ్ విప్ పదవి ఆశిస్తున్నారు. వినుకొండ నుంచి టిడిపి తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో టిడిపి తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 2014 లోను విజయం సాధించారు. 2019లో మాత్రం ఓడిపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే మంత్రి పదవి ఆశించిన ఆంజనేయులకు ఛాన్స్ దక్కలేదు. కనీసం చీఫ్ విప్ పదవి ఇవ్వాలని ఆయన పార్టీ నాయకత్వాన్ని కోరినట్లు సమాచారం. ఈ ముగ్గురిలోఒకరికి పదవి ఖాయమన్నట్లు ప్రచారం జరుగుతోందిప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ జగన్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారు. మరోవైపు కీలక బిల్లులు శాసనసభలో ఆమోదం పొందుతున్నాయి. ఈ తరుణంలో చీఫ్ వీప్ తో పాటు ఏడు విప్ పదవులను భర్తీ చేయనున్నారు. అయితే ఓటమి అభ్యర్థులు 164 మంది ఎన్నికైన నేపథ్యంలో పదవులకు విపరీతంగా పోటీ ఉంది. మరి చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి

## డోంట్ వర్రీ అమ్మా... నేను చూసుకుంటా:

-మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యం బాగాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఏజెంట్ చేతిలో మోసపోయానని, ఆరోగ్యం దెబ్బతిన్నదని, తనను స్వస్థలానికి చేర్చాలంటూ నారా లోకేశ్ కు విజ్ఞప్తి చేసింది. ఆ వీడియోలో మామిడి దుర్గ కన్నీటిపర్యంతమైంది. ఆమె పరిస్థితి పట్ల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. "ఇక నువ్వు బాధపడొద్దమ్మా... నేను చూసుకుంటాను. ఇప్పుడే నీ విషయాన్ని ఎన్నారై టీడీపీ వాళ్లకు వివరిస్తాను. వాళ్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ నిన్ను కాపాడతారు. వీలైనంత త్వరలో నిన్ను స్వస్థలానికి చేర్చే ఏర్పాట్లు చేస్తారు' అని నారా లోకేశ్ ట్వీట్ చేశారు. మామిడి దుర్గ వీడియోను కూడా లోకేశ్ పంచుకున్నారు.

## రైతులను ఆదుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. "వరద ప్రభావిత ప్రాంతాల్లోని రైతుల దుస్థితి పట్ల మీ క్యాబినెట్ సహచరులు కానీ, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు కానీ ఒక్కరు కూడా మాట్లాడకపోవడం నిరాశ కలిగించింది. మీ ప్రభుత్వం గుప్పించిన హామీలు, వాగ్దానాలకు... మీరు వ్యవహరిస్తున్న తీరు విరుద్ధంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ తరఫున మిమ్మల్ని గట్టిగా కోరుతున్నది ఏంటంటే... రైతుల కష్టాలను రాష్ట్ర ఎమర్జెన్సీగా ప్రకటించండి. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి, తగిన నష్టపరిహారం చెల్లించేందుకు వీలుగా వెంటనే పలు బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిశీలనకు పంపండి. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే పంట పొలాల మునకకు దారితీసింది. గత ప్రభుత్వం కాలువల నిర్వహణను విస్మరించింది. కాలువల మరమ్మతులకు ఉద్దేశించిన నిధులను గత ప్రభుత్వం దారిమళ్లించింది. వెంటనే కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించాలని మీ ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అంతేకాదు, గత ప్రభుత్వం రైతులకు ధాన్యం సేకరణ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఇప్పుడు వర్షాలు, వరదలతో సతమతమవుతున్న ఆ రైతులకు బకాయిలు కూడా చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల తన లేఖలో వివరించారు.

## దేశంలోనే ఈవేస్ట్‌లో ఏపీ 12వ స్థానం

-మొదటిపేజీ తరువాయి

చేసే రాష్ట్రాల్లో ఏపీ టాప్-3లో లేదని, ఈ జాబితాలో మన రాష్ట్రానిది 12వ స్థానం అని వెల్లడించారు. రాష్ట్రంలో పలు చోట్ల రీసైక్లింగ్ యూనిట్లు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ప్రతి జిల్లాలోనూ ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లు స్థాపిస్తామని, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనిట్లు నెలకొల్పుతామని చెప్పారు. ఈ-వ్యర్థాలను సేకరించి సమర్థవంతంగా తొలగించేందుకు తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శాసనమండలిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... దేశంలోనే ఈ వేస్ట్‌లో రాష్ట్రం పన్నెండో స్థానంలో ఉందన్నారు. ఈ వేస్ట్ రిసైక్లింగ్ కోసం రాష్ట్రంలో ఆరు కేంద్రాలున్నాయన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు రీసైక్లింగ్ చేస్తున్నామన్నారు. పెరుగుతున్న ఈ వేస్ట్‌కు అనుగుణంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ రీ సైక్లింగ్ సెంటర్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ తెలిపారు.

**నిత్యావసర వస్తువులపై మంత్రి నాదెండ్ల...**

నిత్యావసర వస్తువులపై మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామన్నారు. కేంద్రం కూడా యాప్ ద్వారా రాష్ట్రంలోని నాలుగు సెంటర్స్ నుంచి 22 వస్తువులు ధరలు సేకరిస్తుందన్నారు. 181 రూపాయలున్న కందిపప్పును ప్రత్యేక కౌంటర్ల ద్వారా 160 రూపాయలకే అందిస్తున్నామన్నారు. స్టీమ్ రైస్‌ను కేజీ 49 రూపాయలకు, రా రైస్‌ను 48 రూపాయలకు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కందిపప్పు , బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటున్నాంమని తెలిపారు. నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెట్‌పై కూడా దృష్టి సారించామన్నారు. నిత్యావసర వస్తువులు వ్యాపారుల చేతుల్లో కంటే వినియోగదారుల వద్ద ఉండేలా చర్యలు తీసుకుంటున్నాంమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ శాసనసభ సమావేశాలు కూడా ప్రశాంతంగా జరుగుతున్నాయి. సభ మొదలైన వెంటన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానం ఇస్తున్నారు. రాష్ట్రంలో రౌడీయిజంపై మంత్రి హోంమంత్రి సమాధానం ఇచ్చారు. అలాగే విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజ్‌లో టాయిలెట్ల షార్టేజ్‌పై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించగా... త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. అనంతరం టీడీఆర్ బాండ్లపై తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి.

## అఖిలేష్ లాబీయింగ్...

**ఇండియా కూటమిలోకి జగన్**

**విజయవాడ :** జగన్ ఇండియా కూటమికి దగ్గరవుతున్నారా? జాతీయ పార్టీల అండ ఉండాలనుకుంటున్నారా? అవసరమైతే కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపాలనుకుంటున్నారా? జాతీయస్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఇది. ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ జగన్ హస్తిన బాట పట్టారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. మద్దతు తెలపాలని జాతీయస్థాయిలో అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. కానీ పార్టీల నుంచి స్పందన అంతంత మాత్రమే. ఏపీలో మిగతా పార్టీలు స్పందించలేదు. రాజకీయ స్నేహితుడైన కేసీఆర్ పార్టీ సైతం పెద్దగా మొగ్గు చూపులేదు. కానీ అనూహ్యంగా సమాజ్ వాది పార్టీ ధర్నాకు సంఘీభావం తెలపడం విశేషం. తద్వారా కొత్త సమీకరణలకు సంకేతాలు వెలువడ్డాయి. సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ద్వారా ఇండియా కూటమిలోకి ఎంట్రీకి జగన్ ప్రయత్నిస్తున్నట్లు తేటతెల్లమయ్యింది. కాంగ్రెస్ పార్టీతో ఉన్న విభేదాల దృష్ట్యా అఖిలేష్ సాయాన్ని జగన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో సమాజ్ వాది పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. ఎంపి స్థానాలను సాధించింది. భవిష్యత్ రాజకీయ అవసరాల దృష్ట్యా అఖిలేష్ యాదవ్ జగన్ కు స్నేహ హస్తం అందించినట్లు తెలుస్తోంది. ఏపీలో మిగతా రాజకీయ పక్షాలు జగన్ తో కలిసేందుకు సాహసించడం లేదు. కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. టిడిపి, బిజెపి,జనసేన ఉమ్మడిగా ముందుకు సాగుతున్నాయి. వచ్చే ఎన్నికల వరకు ఇదే సమన్వయంతో కొనసాగాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ తరుణంలో ఏపీలో మిగతా రాజకీయ పక్షాలను కలుపుకొని వెళ్లాలంటే.. ఇండియా కూటమిలో చేరడం శ్రేయస్కరమని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.కేంద్రంతో పాటు ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా జగన్ ఢిల్లీలో ధర్నా చేపడుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఎన్డీఏకు వ్యతిరేకంగా వెళుతున్నట్టే. దేశంలో చాలా పార్టీలకు సమాచారం ఇచ్చారు. మద్దతు కోరారు. కానీ ఎన్డీఏ పక్షాలు మద్దతు తెలిపే ఛాన్స్ లేదు. కానీ అనూహ్యంగా ఇండియా కూటమిలోని సమాజ్ వాది పార్టీ ముందుకొచ్చింది. సంఘీభావం ప్రకటించింది. కేంద్రంలో ప్రధాని మోదీ, బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు అఖిలేష్. ఎన్డీఏ కూటమి అంటేనే అల్లంత దూరంలో ఉంటారు. అటువంటి అఖిలేష్ నేతృత్వంలోనే సమాజ్ వాది పార్టీ జగన్ కు మద్దతు తెలపడం వెనుక చాలా కథ నడిచినట్లు సమాచారం. ముఖ్యంగా జగన్ ఇండియా కూటమి వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేషనల్ మీడియా సైతం ఇదే స్పష్టం చేస్తోంది.ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీగా సమాజ్ వాది పార్టీ నిలిచింది. కాంగ్రెస్ పార్టీ తర్వాత ఎక్కువ ఎంపి స్థానాలను దక్కించుకుంది. బిజెపికి యూపీలో చావు దెబ్బతీసింది. బిజెపి సొంతంగా అధికారంలోకి రాకుండా చేయడంలో సమాజ్ వాది పార్టీ సక్సెస్ అయ్యింది. అటువంటి సమాజ్ వాది పార్టీ మద్దతును జగన్ కూడగట్టారు. ఇది కచ్చితంగా కేంద్ర పెద్దలకు ఆగ్రహం తెప్పించే విషయమే. అయితే ముందస్తు వ్యూహంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందిఇప్పుడున్న పరిస్థితుల్లో బిజెపి వైసిపికి సహకరించే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి రాజ్యసభలో వైసిపి అవసరం ఉన్నా.. కొద్ది రోజుల్లో రాజ్యసభలో ఎన్డీఏ ప్రాతినిధ్యం పెరగనుంది. మ్యాజిక్ ఫిగర్ దాటనుంది. మరోవైపు లోక్ సభలో టిడిపి కింగ్ మేకర్ గా ఉంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పొదిలి సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లిన ఎమ్మెల్యే కందుల



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)**

మండలంలో నెలకొన్న పలు సమస్యలపై మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం అసెంబ్లీలో లోకేష్ తో కాసేపు నియోజకవర్గ సమస్య లపై చర్చించారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలోని వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఆయా జలాలను పొదిలి మండలానికి సరఫరా చేయాలని మంత్రి లోకేష్‌ను ఆయన కోరారు. ఎమ్మెల్యే కందుల తాగు, సాగు నీటి వనరులు లేని పొదిలి మండలానికి దర్శి సాగర్ కాలవ నుంచి పొదిలి పెద్ద చెరువుకు సాగర్ జలాలు నింపి పొదిలి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. అందుకు స్పందించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆయా సమస్యలు త్వరితగతిన పూర్తి చేసి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కందులకు లోకేష్ భరోసా ఇచ్చారు.

# వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 25)**



వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గురువారం నాడు శాసనసభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ... టీడీపీ హయాంలో దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్ రెడ్డి వారి పొట్ట కొట్టారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఎస్సీ ఎస్టీల కోసం నూతన పారిశ్రామిక విధానం అమలు చేయలేదని విమర్శించారు. బి, సి కేటగిరి కింద మెడికల్ సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదన్నారు. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సీఆర్పీసీ కింద స్టేషన్ బెయిల్ మంజూరు చేశారని అన్నారు. ఎస్సీలకు ఇళ్ల నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.50,000/- అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపేశారని వివరించారు. ఉద్యోగాల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ చట్టం సక్రమంగా అమలు కాలేదు. ఎస్సీలకు పథకాల అమలులో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎస్సీ నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉన్న అమరావతి రాజధాని నిర్మాణం నిలిపేశారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. దళితులకు మేనమామ అని చెప్పుకునే జగన్ రెడ్డి కంసమామలా మారి వారికి ద్రోహం చేశారని అన్నారు. అందుకే దళితులు తిరగబడి రాష్ట్రంలో వైసీపీని తరిమి కొట్టారని అన్నారు. గత టిడిపి హయాంలో దళితులకు అన్ని విధాల మేలు చేశామని మంత్రి అన్నారు. 2014 - 2019లో ఐఎస్ బి సెక్టార్, పశు సంవర్ధక శాఖ కింద బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా 60 శాతం సబ్సిడీతో రూ.2716.70 కోట్లతో 2,02,414 మంది ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. భూమిలేని పేదలకు భూమి కొనుగోలు పథకం ద్వారా రూ. 197 కోట్లతో 2,518 మందికి 2360.77 ఎకరాల భూమి పంపిణీ చేశామని, ఎన్ఎస్ఎఫ్డీసీ కింద రూ. 552.55 కోట్లతో 10,634 మంది ఎస్సీ యువతకు ఇన్నోవా కార్లు, రవాణా రంగంలో అధిక విలువ గలిగిన ప్రాజెక్ట్ ఆధారిత యూనిట్లు అందించామన్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా ద్వారా రూ. 29.39 కోట్లతో 669 మందికి ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు లాంటి మెట్రోపాలిటన్ సిటీల్లో ఉచితంగా సివిల్స్ కోచింగ్ అందించామని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ ద్వారా రూ.165.29 కోట్లతో 23,389 మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిం చమన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.32.23 కోట్లతో 437 మంది విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించామని మంత్రి స్పష్టం చేశారు. కానీ జగన్ రెడ్డి మాత్రం ఆ పథకానికి అంబేద్కర్ పేరు మార్చి తన పేరు పెట్టుకుని అంబేద్కర్ నే అవమానించారని అన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలన్నీ త్వరలోనే తిరిగి పునరుద్ధరిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

# సాగర్ నీరు తాగునీటి అవసరాలకు వినియోగించాలి

## కలెక్టర్ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 25)**

సాగర్ జలాలను తాగునీటి అవసరాలు తీర్చేలా సమర్థంగా పంపిణీ చేయడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. సాగర్ జలాలతో నింపుతున్న పుల్లలచెరువు మండలం ముటుకులలోని సమ్మర్ స్టోరేజీ చెరువును గురువారం ఆమె సందర్శించారు. సీపీడబ్ల్యు.ఎస్ పంపు హౌస్, మైక్రో ఫిల్టర్లు, క్లోరినేషన్ సంపు, ఇతర విభాగాలను ఆమె పరిశీలించారు. ఈ నీటి పంపిణీ జరిగే గ్రామాల వివరాలను, పంపిణీ విభాగ నిర్వహణ వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ చెరువు నీటిని 23 గ్రామాలకు సరఫరా చేస్తామని ఆర్.డబ్ల్యు.ఎస్. సూపరింటిండెంట్ ఇంజనీర్ మర్దన్ అలీ ఆమె వివరించారు. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తమ గ్రామానికి నీరు అందిస్తున్నారని, అయితే గ్రామంలో అంతర్గత పైపులైన్లు అందుబాటులోకి ఇంకా రాలేదని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా అంతర్గత పైపులైన్ల ఏర్పాట్లకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, ఈ పథకం 2027 మార్చి వరకు ఉంటుందన్నారు. కావున పైప్ లైన్లు వేసే పనులను కూడా పూర్తి చేసేలా చూస్తామని మర్దన్ అలీ వివరించారు. స్టోరేజీ చెరువులోకి పశువులు దిగకుండా దాని చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పూర్ణచంద్రరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీధర్రావు, డి.ఈ.ఈ. నవ కిషోర్, జే.ఈ. రామకృష్ణ ఇతర అధికారులు ఉన్నారు..



### నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

ముటుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ ప్రాంగణంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ఆమె పరిశీలించారు. వివిధ తరగతులలోని విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో వాటిని చదివించి (తరువాయి 4లో...)

# గిజనుల సమస్యలను పరిష్కరిస్తాం

## కలెక్టర్ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 25)**

జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. జిల్లాస్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని, రాష్ట్రస్థాయికి తీసుకు వెళ్లాల్సిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. గురువారం ఆమె ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామపంచాయతీలోని గిరిజనుల పునరావాస కాలనీని సందర్శించారు. గిరిజనులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీకి తాగునీటి సమస్య ఉందని, ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు సరిపోవటం లేదని ప్రజలు చెప్పగా.... అవసరమైన స్థాయిలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తమకు కేటాయించిన (తరువాయి 4లో...)



# డాక్టరా..యాక్టరా..!

**మహిళలకు రక్షణ ఎక్కడ..?**

**సింగరాయకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఒక వైద్యుడు**

**గత కొన్నేళ్ల క్రితం నుంచి ఇక్కడే తిష్ట వేసిన అధికారి**

**ఆసుపత్రికి రావాలంటే బెంబేలెత్తిపోతున్న మహిళలు**

**ఆసుపత్రి పరిధిలో నా మాటంటే హడల్**

**నాకు అడ్డు చెబితే కఠిన చర్యలు**

**నోటి దురుసుతనం మాటలే మహిళలకు తప్పని తిప్పలు**

**జిల్లా వైద్యాధికారి మీరైనా మహిళలకు రక్షణ కల్పించండి**



**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 25)**

పేద, బడుగు బలహీన, మధ్య తరగతి కుటుంబాల మహిళలు కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి వారికి వచ్చిన చిన్న పెద్ద తరహాలో వచ్చే పలు రోగాలకు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకో లేక బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్రజలకు ఉచితంగా ఆపరేషన్లు, పలు జబ్బులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. అంతవరకు బాగానే ఉంది. ప్రాణం పోసేది దేవుడు అయితే, ఆ ప్రాణాన్ని కాపాడేది మాత్రం వైద్యుడు. అంటే దేవుడితో సమానం అని సమాజమే చెప్పుకుంటుంది. అలాంటి వైద్యుడికి అనుకోకుండా గత కొన్ని నెలల క్రితం నుంచి సింగరాయకొండ ప్రభుత్వ వైద్యశాలలో ప్రభుత్వ వైద్యులుగా పనిచేస్తున్న ఒక డాక్టర్ కింది స్థాయిలో పనిచేస్తున్న పలువురు మహిళల పై ఇష్టానుసారంగా నోటి దురుసుతో అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతుంటే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఏ క్షణాన ఎవరిపై ఏ మాట తన నోటికి వచ్చినట్లు దురుసుగా మాట్లాడుతాడో అర్థం కాని పరిస్థితి దాపురించిందని క్రింది స్థాయి ప్రభుత్వ మహిళలు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పుడేం కొత్త కాదు కొన్ని నెలల క్రితం నుంచి ప్రభుత్వ వైద్యాధికారి నోటి దురుసుతనానికి అడ్డు అదుపు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో స్త్రీకి అత్యంత విలువ ఇవ్వాల్సిందే. దీంట్లో ఎలాంటి సందేహం అక్కర్లేదు . చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటున్నా వారి పట్ల ఒక ప్రభుత్వ వైద్యుడు మాట్లాడే మాటలు వింటున్న సాటి ఉద్యోగస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే ఎవరి డ్యూటీ వారు సింగరాయకొండ ప్రభుత్వ వైద్యశాలలో వారి వారి విధుల పట్ల సక్రమంగా పనిచేసుకుంటూ వచ్చిన ప్రతి రోగిని స్త్రీ పురుషుడు తేడా లేకుండా వారిని అక్కున చేర్చుకుని ప్రభుత్వం తరఫున మంజూరైన మందులు ఉచితంగా వారికి ఇచ్చి ఆ మందులను ఏ విధంగా వినియోగించుకోవాలో అర్థమయ్యే విధంగా రోగులకు వివరించి చెబుతూ ప్రజల హృదయాలను ప్రభుత్వ మహిళా ఉద్యోగస్తులపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ సింగరాయకొండ ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ నోటి దురుసుతనానికి అడ్డే లేదు. గత పది రోజుల క్రితం నుంచి ఒక మహిళా ఉద్యోగి పట్ల సదరు డాక్టర్ వ్యవహరిస్తున్న తీరు చిలికి, చిలికి గాలి వాన లాగా మారింది. ఈ వైద్యుడు దెబ్బకి సదరు మహిళ ఉద్యోగి భయభ్రాంతులకు గురవుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె సక్రమంగా విధులు (తరువాయి 4లో...)

# సాగర్ నీరు తాగునీటి అవసరాలకు వినియోగించాలి







వారిలోని విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. తరగతుల స్థాయికి తగినట్లుగా వారిలో విద్యా ప్రమాణాలు లేకపోవడంతో టీచర్లపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలోని వంటగదిని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనంలో భాగంగా సిద్ధం చేసిన పులిహోరను కలెక్టర్ ప్రత్యేకంగా తిని దాని రుచిని పరిశీలించారు. పులిహోర రుచికరంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు వాటి రుచిని, నాణ్యతను ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. విద్యార్థులు ఎవరూ బడి మానివేయకుండా చూడాలని టీచర్లకు ఆమె దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలోని మొత్తం విద్యార్థులు, టీచర్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. తగిన సంఖ్యలో ఈ పాఠశాలకు టీచర్లు లేరని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని ఆమె హామీ ఇచ్చారు.

**అపరిమిత వినియోగాన్ని అరికట్టాలి**

పరిమితికి మించి భూగర్భ జలవనరుల వినియోగాన్ని అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముటుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, కలవకుంట గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసిన పీజో మీటర్లను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో భూగర్భ జల నీటి మట్టం వివరాలను వీటి ద్వారా తెలుసుకునే విధానాన్ని అధికారులు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. జిల్లాలో అధిక భూగర్భ నీటి వినియోగ గ్రామాలు 57 ఉన్నాయని వారు చెప్పగా, పరిమితికి మించి భూగర్భ జల వినియోగం జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ నీటిమట్టం పెరిగేలా చూడాల్సి ఉన్నదని, ఈ విషయంలో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టే నీటి సంరక్షణ పథకాలపై మరింత దృష్టి సారించి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నదని అన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా భూగర్భ వనరుల శాఖ అధికారి విద్యాసాగర్, ఇతర అధికారులు ఉన్నారు.

**కొత్తచెరువు సమస్య పరిష్కారానికి కృషి**

మండల పరిధిలోని కొత్తచెరువును కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో కంభం చెరువు తర్వాత ఇదే పెద్ద చెరువు అని, సుమారు రెండు వేల ఎకరాలు ఈ చెరువు కింద సాగు అవుతున్నాయని స్థానికులు ఆమెకు వివరించారు. సుమారు రెండేళ్ల క్రితం ఈ చెరువుకు గండి పడిందని, తాత్కాలికంగా మరమ్మతులు చేశారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. తాగునీటి కొరత ఉన్న గ్రామాలకు ఇక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్నట్లు కూడా వారు తెలిపారు. ఈ చెరువులో నీరు నిలిచేలా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చర్యలు తీసుకుంటే తమకు సాగునీటికి ఇబ్బంది ఉండదని స్థానికులు చెప్పగా, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డి.ఎల్.డి.వో. సాయికుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.

# గిజనుల సమస్యలను పరిష్కరిస్తాం






ఆర్.ఓ. ఎఫ్.ఆర్.భూములలో కూడా సాగుకు అవసరమైన నీటి వసతి కల్పించాలని గిరిజనులు కోరగా..బోర్ వేసి నీటి సౌకర్యం కల్పించేలా అటవీ శాఖ అధికారులతో చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. మన జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో ఉన్న పి.టి.జి. గిరిజన ప్రాంతాలలో పాఠశాలలు, అంగన్వాడీలు, తాగునీటి కోసం బోర్ వెల్స్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఆయా ఆవాసాల వారీగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తనకు నివేదించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ. రవీంద్రారెడ్డికి ఆమె చెప్పారు. జిల్లాస్థాయిలో పరిష్కారం అయ్యే సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఎర్రగొండపాలెం లో గిరిజన హాస్టల్ కావాలని స్థానిక ప్రజలు కోరగా, దీనితో పాటు జిల్లా స్థాయిలో పరిష్కరించలేని ఇలాంటి ఇతర అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆమె భరోసా ఇచ్చారు. జీవనోపాధి కోసం తమకు 5 ఎకరాల స్థలముతో పాటు ఇంటి స్థలము ఇస్తే కోర్ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతంలోకి రావటానికి గిరిజనులు ఇష్టపడుతున్నారని, ఇందుకు గల అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డి.ఎల్.డి.ఓ.సాయి కుమార్, ఆర్.డి.టి.స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక అధికారులు, గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఎర్రగొండపాలెంలోని అటవీశాఖ గెస్ట్ హౌస్ లో కలెక్టర్ ఒక మొక్కను నాటి ప్రజలలో స్ఫూర్తిని నింపారు.

## డాక్టరా..యాక్టరా..!



నిర్వహిస్తున్నప్పటికీ ఇంకొక మహిళని అడిగి ఆమె సలహాలు తీసుకొని మీరు పాటించాల్సిందే అంటూ ఉచిత సలహాలు ఇస్తూ సదరు మహిళ ఉద్యోగి పై డాక్టర్ వేధింపులు అధికమవుతున్నాయి. ఒకవేళ సదరు మహిళా ఉద్యోగికి జరగరానిది ఏమైనా జరిగితే అందుకు పూర్తి బాధ్యత సదరు వైద్యుడిదేనని మహిళా ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మహిళ ఉద్యోగినుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న సదరు వైద్యుడు పై జిల్లా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు.

## నూతన కమిషనర్ మల్లవరపు సూర్య తేజ కి శుభాకాంక్షలు తెలిపిన కర్తం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 25)

14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి నెల్లూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లవరపు సూర్య తేజను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. 16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, 13వ డివిజన్ కార్పొరేటర్ నాగార్జున నూతన కమిషనర్‌కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా నియమితులైన హెల్త్ ఆఫీసర్ చైతన్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్తం మాట్లాడుతూ డివిజన్‌లోని పలు సమస్యలు నూతన కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు పేర్కొన్నారు. మల్లవరపు సూర్య తేజ నేతృత్వంలో నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

## టాయిలెట్స్ నిర్మాణానికి కృషి

### రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి కార్పొరేటర్ కృతజ్ఞతలు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 25)

నెల్లూరు రూరల్ 28వ డివిజన్ కేశవల్ నగర్ లోని మున్సిపల్ స్కూల్లో టాయిలెట్స్ లేక 200 మంది పిల్లలు అవస్థలు పడుతుంటే, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి చెప్పి చెప్పగానే అధికారులకు ఆదేశాలు పంపి టాయిలెట్స్ నిర్మాణానికి ఎంత గానో కృషి చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జి రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దొడ్డపునేని రాజా నాయుడు, 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్క అహల్యకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి చక్కా సాయి సునీల్, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి




(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జులై 25)

రెవెన్యూ డివిజనల్ అధికారి వారు చేజర్ల మండలం పెళ్లేరు, తూర్పు కంబంపాడులో గ్రమకంఠం, పెన్నా పోరంబోకు ఆక్రమణల విషయమై స్వయంగా విచారణ జరిపి తహసీల్దారు, మండల అభివృద్ధి అధికారిణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సిబ్బందికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ నెల 25వ తేదీన తగిన సూచనలు ఇచ్చారు.

## ఎమ్మెల్యే తాటిపర్తి క్షమాపణలు చెప్పాలి

### తెలుగు యువత జిల్లా అధ్యక్షులు ముత్తన శ్రీనివాసులు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

అన్న క్యాంటీన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు ముత్తన శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ముత్తన శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కర్షకులకు రూ.5లకే అన్నం పెట్టేందుకు తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ప్రారంభించిందన్నారు. గత ఐదేళ్ళ కాలంలో వైసిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూత వేసి సచివాయాలలు ఏర్పాటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదలు, కార్మికులు, కర్షకులు. నిరుద్యోగుల పొట్ట కొట్టారన్నారు. అన్న క్యాంటీన్లలో రూ.5లకే అన్నం పెడుతున్నా మున్సిపాలిటీలు రూ.27లు, ప్రభుత్వం 17 రూపాయలు భరించి ప్రజలకు అల్పాహారం, భోజనం పెడుతుం దన్నారు. అన్నం పరబ్రహ్మ, స్వరూపమని, ఇటువంటి అన్న క్యాంటీన్లలో బిచ్చగాళ్ళకు పెట్టినట్లు అన్నం పెట్టి టిడిపి రాజకీయం చేస్తుందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ అన్న క్యాంటీన్లపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పకపోత ఎమ్మెల్యే ఇంటిని తెలుగు యువత నాయకులు ముట్టడి స్తాదను హెచ్చరించారు. సమావేశంలో వ్రాయకులు గౌర)ముచ్చు శేఖర్ దయానంద్ నల్లమోతు రమేష్ పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

- స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారిపై గౌరవంగా వ్యవహరించాలి
- సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలి
- ఎన్ఫోర్స్మెంట్ పెంచి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలి
- గంజాయి అక్రమ రవాణా, విక్రయాల పై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

















(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 25)

దర్శి సర్కిల్ పరిధిలోని తాళ్ళూరు, ముండ్లమూరు, దర్శి పోలీస్ స్టేషన్‌లను, ఒంగోలు సబ్ పరిధిలోని చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లను గురువారం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సందర్శించి పోలీసు స్టేషన్‌లోని లాకప్, రిసెప్షన్, కంప్యూటర్ రూమ్, జి.డి మరియు రికార్డుల నిర్వహణ, పోలీసు స్టేషన్ పరిసరాలను, వివిధ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలన్నిటిని పరిశీలించారు. పని చేయుచున్న సిబ్బంది వివరాలు, వారి విధి నిర్వహణ పని తీరు గురించి ఆరాతీశారు. ప్రతి స్టేషన్ ఆవరణను పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ లలో పెండింగ్ ఫైల్స్‌ను తనిఖీ నిర్వహించి పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని, స్టేషన్ రికార్డ్స్ అన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. మహిళలు,పిల్లలు భద్రత విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అలాగే నేరాలను అరికట్టేందుకు గస్తి ముమ్మరం చేయాలని, అసాంఘిక చర్యలపై అడ్డుకట్ట వెయ్యాలన్నారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు విజబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు, పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో బీట్లు తిరిగే సమయంలో చెడునడత, హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో విధిగా పర్యటించాలని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని,ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ప్రజలకు సీసీ కెమెరాల పై అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, అలాగే సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరగాలు చూపే మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్ నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, సిబ్బందికి ఏమన్నా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సిబ్బందికి రోల్ కాల్స్ నిర్వహించాలని తెలిపారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట తాళ్ళూరు, దర్శి, చీమకుర్తి ఎస్ఐలు విజయకుమార్, సుమన్, వెంకట కృష్ణయ్య, చీమకుర్తి పిఎస్ఐ రాజమోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

## వైద్యశాఖ అక్రమాల పై గుంటూరు జోనల్ ఆర్‌డిఎం డాక్టర్ శోభారాణి విచారణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి గుంటూరు జోనల్ ఆర్‌డిఎం, హెచ్ఎస్ డాక్టర్ శోభారాణి గురువారం చేరుకున్నారు. ప్రకాశం జిల్లాలో 2002 నుంచి వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన హెల్త్ అసిస్టెంట్ నియామకాలలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్లను విచారించారు. హెల్త్ అసిస్టెంట్ల నియామకానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి హాజరైన ఆమెకు అందరి నియామక పత్రాలను పరిశీలనకు సమర్పించారు. గుంటూరు ఆర్‌డిఎం, హెచ్ ఎస్ డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాసులరెడ్డి, వారి కార్యాలయ బృందం నియామక పత్రములను పరిశీలించి హెల్త్ అసిస్టెంట్స్ నుంచి డిక్లరేషన్ పత్రాలు తీసుకొని తదుపరి చర్యలకు పై అధికారులకు నివేదికను సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, పరిపాలన అధికారి గీతాంజలి, సూపరిండెంట్ రాజేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల, బాలికల సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు చేపట్టాలి

మంత్రి స్వామిని కోరిన వైపాలెం

టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 25)

అమరావతి సచివాలయంలోని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామిని యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో బాల, బాలికల సంక్షేమ హాస్టళ్ల విషయంలో కావాల్సిన అదనపు భవనాలు, మరమ్మతులకు త్వరగతిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి సానుకూలంగా స్పందించి యర్రగొండ పాలెం నియోజకవర్గానికి కావల్సిన అదనపు భవనాలు, మరమ్మతులను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అల్లినగరం ఉన్నత పాఠశాలలో ఘనంగా శిక్షా సప్తాహ వారోత్సవాలు






(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 25)

అల్లినగరం ఉన్నత పాఠశాలలో ఘనంగా శిక్షా సప్తాహ వారోత్సవాలు గురువారం కొమరోలు మండలం అల్లినగరం శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి అధ్యక్షతన శిక్షా సప్తాహ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలలో తొలిరోజు స్థానిక వనరులతో బోధన సామాగ్రి ప్రదర్శన నిర్వహించగా,రెండో రోజు సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, మూడోరోజు క్రీడా పోటీల నిర్వహణ, నాలుగో రోజు గురువారం పాఠశాలలో బాల బాలికలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గురించి, వివిధ భాషలు సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట నారాయణ, కోటేశ్వరరావు, సుజాత, ప్రకాశరావు, శివరాం, చంద్రమోహన్, గురువయ్య, రసూల్ బి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బదిలీ పై వెళ్తున్న తహసీల్దార్ సుందరమ్మకు సత్కారం

రెవెన్యూ చట్టాలపై అవగాహన కలిగి సమస్యలను పరిష్కరించాలి

తహసీల్దార్ కెవిబిటి సుందరమ్మ




(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జులై 25)

రెవెన్యూలో మారుతున్న చట్టాలపై అవగాహన కలిగి భూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని తహసిల్దార్ కెవిబిటి సుందరమ్మ సిబ్బందికి తెలియజేశారు. ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం నుంచి మద్రిపూడి మండలానికి తహసిల్దార్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నికల విధులను విజయవంతంగా నిర్వహించి ఉన్నతాధికారుల ఆదరాభిమానాలు చూరగొన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం మరల అధికారుల బదిలీలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహ సిల్దారును పొట్టి శ్రీరాములు జిల్లాకు బదిలీ ఉత్తర్వులు రావడంతో గురువారం మద్రిపూడి తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తున్న సుందరమ్మకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ఆమె మాట్లాడుతూ వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు ఉన్నతాధికారులు చెప్పే విషయాలను సవివరంగా తెలుసుకుని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. నా స్థానంలో ఏ అధికారి వచ్చిన ఆ అధికారికి సహకరించి రెవెన్యూ శాఖకు తమకు మంచి పేరు వచ్చేలా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగంలో బదిలీలు సర్వసాధారణమన్నారు. తనకు ఇక్కడ మీరందరూ మనందరం ఒక కుటుంబంలాగా కలసిమెలసి చేయడం వలన సాధ్యమైందని అన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న తహసిల్దార్ సుందరమ్మను ఇన్చార్జి తహసిల్దార్ కే రాఘవేంద్ర భూపతి, వీఆర్వోలు, విలేజ్ సర్వేర్లు, సిబ్బంది, గ్రామ నౌకర్లు ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇక్కడ పనిచేస్తున్న డిటీ నూతన ఇన్చార్జి తహసిల్దారుగా కే రాఘవేంద్ర, భూపతి, బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు కే సమూ వేలు, కృష్ణ, కాసిం, సందీప్, ఏబేలు, ఏడుకొండలు, మోషే, కిషోర్, వీఆర్వోలు విలేజ్ సర్వేలు, వీఆర్ఏలు, తదితరులు ఉన్నారు.

## ఏకేయూ మొదటి సెమిస్టర్ లా విభాగం పరీక్షా ఫలితాలు విడుదల

ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించిన విసి, రిజిస్ట్రార్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)



ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న రెండు న్యాయ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షలకు సంభందించిన ఫలితాలను ఏ.కే.యూ. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి గురువారం లాంఛనంగా విడుదల చేశారు. ఆయా కళాశాలల నుంచి మూడు సంవత్సరాల లా కోర్సుకు గాను మొత్తం 320 మంది విద్యార్థులు హాజరు కాగా, 69.7 శాతం ఉత్తీర్ణతతో 223 మంది పాసైనారు. ఐదు సంవత్సరాల లా కోర్సుకు సంభందించి మొత్తం 64 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా, 62.5 శాతం ఉత్తీర్ణతతో 40 మంది విద్యార్థులు పాసైనారు. రెండు సంవత్సరాల పి.జీ లా కోర్సుకు సంభందించి మొత్తం 44 మంది విద్యార్థులు హాజరుకాగా, 91శాతం ఉత్తీర్ణతతో 40 మంది పాసైనట్లు ఏకేయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే.వి.ఎన్.రాజు విలేఖరులకు తెలిపారు. మొదటి సెమిస్టర్ లా విభాగం ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను చూపిన పలువురు ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో ర్యాంకులను సాధించి తమ కళాశాల కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేశారు. సోమవారం విడుదలైన లా విభాగం ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను యూనివర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, సి.ఈ. డాక్టర్ కే.వి.ఎన్.రాజు తదితరులు హృదయ పూర్వకంగా అభినందనలు తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్, సి.ఈ. డాక్టర్ కె.వి.ఎన్. రాజు, సి.టి.ఏ.డాక్టర్ జి.సోమ శేఖర, ఏ.సి.టీ.ఏ. డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగం పర్యవేక్షకులు శివరామయ్యతో బాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు వి.సి. ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరి బాబు, సి.ఈ. డాక్టర్ కె.వి.ఎన్.రాజు, తదితరులు అభినందనలు తెలిపారు.

## ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని జ్యోత్స్నకు రూ.10 వేలు నగదు బహుమతి

బహుమతి అందజేసిన రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి, భర్త మునికృష్ణ




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 25)

పిచ్చాటూరు మండలం వెంగళత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఈ ఏడాది స్కూల్ టాపర్ గాను, అలాగే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని బి.జ్యోస్నకు బంగారుపాలెం రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి, ఆమె భర్త మునికృష్ణ రూ. 10 వేలు నగదును బహూకరించారు. గురువారం ఉదయం వెంగళత్తూరు జడ్పీ హైస్కూల్ కు రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి దంపతులు చేరుకొని విద్యార్థినికి నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నగదు బహుమతిని అందించినట్లు తెలిపారు. ప్రతి ఏటా వెంగళత్తూరు జడ్పీ హైస్కూల్లో చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఇలాంటి బహుమతులు అందజేస్తామన్నారు. తమ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభను గుర్తించి నగదు బహుమతిని అందించిన దాత వరలక్ష్మి దంపతులకు పిచ్చాటూరు ఎంఈఓ యుగంధర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒంగోలు డెయిరీ పూర్వ వైభవానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి



**డెయిరీ పునరుద్ధరణకు సీఎం వద్దకు రాయబారానికి సన్నద్ధం**
**సహకార రంగంలోనే ఒంగోలు డెయిరీని ప్రభుత్వమే నిర్వహించాలి**
**రూ.1000 కోట్ల విలువైన ఒంగోలు డెయిరీ ఆస్తులకు రక్షణ కల్పించాలి**
**సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో**
**ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో పాల కేంద్రం ఒంగోలు డెయిరీ పునరుద్ధరణకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి, ఒంగోలు డెయిరీ వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు డెయిరీని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ 1975లో పాల సేకరణ కేంద్రంగా ప్రారంభమైన ఒంగోలు డెయిరీ 1994కి రెండున్నర లక్షల లీటర్ల పాలు సేకరించి స్థాయికి ఎదిగిందన్నారు. పాల రైతులు రూపాయికి రూపాయి కూడ పెట్టి ఒంగోలు డైయిరీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాల్గొని కర్మాగారానికి శంకుస్థాపన కూడా జరిగిందన్నారు. పాల్పడి కర్మాగార స్థలానికి పాల రైతులు రూ. 19 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. డైరీ 2006 నాటికి రూ. 48 కోట్ల అప్పుల్లోకి వెళ్లిందన్నారు. దీంతో ఎన్ డి డి బి దేవిని స్వాధీనం చేసుకొని 2012 నాటికి అప్పులు తీర్చి డెయిరీని లాభాల బాటలో నిలిపి వెళ్లిందన్నారు. 2014 వరకు లాభాల బాటలో నడిచిన డెయిరీ సహకార రంగం నుండి కంపెనీ యాక్ట్ లోకి తీసుకుపోవటంతో తిరిగి డైరీ సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. ఆ తర్వాత కాలంలో వచ్చిన జగన్ ఏది పూర్తిస్థాయిలో విధ్వంసానికి సన్నద్ధం చేశారు అన్నారు. డెయిరీ అమూల్ కు అప్పగించారన్నారు. లీటర్కు నాలుగు రూపాయలు అదనంగా రైతులకు ఆదాయం ఇప్పిస్తామని జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని పాల రైతుల వద్దకు తిప్పించారన్నారు. అయితే నిర్వహణ సరిగా లేని అమూల్ పూర్తిస్థాయిలో చేతులు ఎత్తివేసిందన్నారు. పాల సేకరణ 3000 లీటర్లకు పడిపోయిందన్నారు. మరోపక్క పాలపొడి ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర ప్రాసెసింగ్ యంత్రాలు మూలనపడి తుప్పుపట్టాయన్నారు. ఒకప్పుడు జిల్లాలోని పాడి రైతులకు జీవనాధారంగా ఉన్న ఒంగోలు డెయిరీ పునః ప్రారంభం కోసం జిల్లా పాడి రైతులు ఎదురుచూస్తున్నారు అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒంగోలు డైరీ కి తగిన నిధులు కేటాయించి, సహకార రంగంలోని ఒంగోలు డైరీ ని ప్రభుత్వ నిర్వహించాలని కోరారు. అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు రాయవారానికి సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు డెయిరీ పూర్వాధ్యక్షులు రామారావు మాట్లాడుతూ డెయిరీ సహకార సంఘం నుండి కంపెనీ యాక్ట్ లోకి పోయిన నాటి నుండి పరిపాలనంత కేవలం వ్యక్తుల చేతుల్లోకి పోయి పూర్తిస్థాయిలో నాశనమైందన్నారు. అందరిలోనూ జవాబు ఉందా అధికరణం కరువైందన్నారు. కంపెనీలని 192 మంది ఉద్యోగులతో పాటు 423 సొసైటీలతో, అందులో పని చేసే ఉద్యోగులతో పాటుగా జిల్లా వ్యాప్తంగా 1500 మంది పాలకైతే కుటుంబాలకు ఉపాధి చూపిన డైరీని నాశనం చేయటంలో పాలకుల హస్తం కూడా ఉందన్నారు. గతాన్ని మరచి ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలోని పాల రైతాంగానికి ఉపాధి చూపేలా వెంటనే ఒంగోలు డెయిరీని ప్రభుత్వమే నిర్వహించేలా ప్రభుత్వం ఒంగోలు డెయిరీని ప్రారంభించాలని కోరారు. ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఒంగోలు డెయిరీని సహకార రంగంలోనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అమూల్ డెయిరీ కూడా గుజరాత్లో సహకార రంగంలో, దేశవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో ఉందన్నారు. సహకార రంగంలో ఉంటే ఏకపక్ష నిర్ణయాలు జరగవు అన్నారు. ఒంగోలు డెయిరీ జిల్లాలోని పాల రైతులకు జీవనాధారం అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఒంగోలు డైరీ సహకార సంఘం నుండి కంపెనీ యాక్ట్ లోకి పోయేనాటి నుండి అనేక







రూపాలలో ఉద్యమాలు నిర్మించామన్నారు. ఏ సంఘానికి ఆ సంఘం విడివిడిగా చేయడం వల్ల పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం రాబట్ట వచ్చున్నారు. ఇప్పటికైనా అన్ని రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు జిల్లావ్యాప్తంగా ఉన్న పార్టీ రైతులను ఐక్యం చేసి వారికి అవగాహన కల్పించి, ఉద్యమంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. అప్పుడు మాత్రమే విజయం సాధించవచ్చు అన్నారు. సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఒంగోలు డెయిరీ పరిధిలోని పాల రైతులు రూపాయికి రూపాయి కూడా పెట్టుకుని ఏర్పాటు చేసుకున్నా ఒంగోలు డెయిరీ ఆస్తుల పరిరక్షణ ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే తగిన నిధులు కేటాయించి ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ నాడు పొగాకు రైతుల పై కాల్పులతో సంక్షోభం, మరోపక్క తెల్ల దోమతో పత్తి సాగుతో అపారమైన నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగానికి పాల సేకరణ జిల్లా రైతాంగానికి జీవనాధారం అయింది అన్నారు. ఒంగోలు డైరీ పునరుద్ధరణ ఉద్యమాన్ని రైతాంగ ఉద్యమాంగా మార్చాలన్నారు. ప్రతి రైతాంగ కుటుంబం ఇంట్లోకి ఉద్యమ పరిస్థితులు తీసుకువెళ్లాలన్నారు. అప్పుడే దీనిని సాధించుకోవచ్చు అని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఇంకా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు ఎస్ లలిత కుమారి, ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వల్లం రెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాయబ్ రసూల్‌ను పరామర్శించిన టీడీపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 25)

ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి ఒంగోలులో ఆపరేషన్ చేయించుకుని స్వగ్రామం పాములురులో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రోగ్రాం కమిటీ సభ్యులు షేక్ నాయబ్ రసూల్ విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ గురువారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన సూచనలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రసూల్ వెంట షేక్ షంషూర్, ఆర్ఆర్ రఫీ, పుత్తూ మస్తాన్, మోబినా, మౌలాలి, కాజా రంతుల్లా, చిన్న హజరత్, అసలీ, కత్తర్ రఫి, షరీఫ్, కాలేష, అంకిత మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయండి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 25)

పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు యర్రగొండపాలెం నియోజకవర్గ సీపీఐ సీనియర్ నాయకులు టిసిఎచ్ చెన్నయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకొని ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో వెయ్యి అడుగులు బోరుబావి తవ్వినా చుక్క నీరు పడటం లేదని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయితే ఈ ప్రాంతానికి తాగు, సాగు నీరు అందుతాయని తెలిపారు. తమరు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కొద్ది రోజుల్లో నిర్ణయించే తాత్కాలిక బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# నాల్గో రోజు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జులై 25)

శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో నాల్గో రోజు గురువారం కల్చరల్ డేను చేజర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా భాగంగా కళలు, సంస్కృతి అభివృద్ధి, సాంస్కృతిక వైవిధ్యం, ప్రోత్సాహం, ప్రదర్శన, నృత్యాలు, జానపదాలు, హరికథలు, బుర్రకథలు, పెయింటింగ్స్, వివిధ భాషల సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయడం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చేజర్ల, టికే పాడు ఉన్నత పాఠశాలల్లో సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు వచ్చారు. ఆదురుపల్లి ఉన్నత పాఠశాలలో భరతమాత చిత్రాన్ని నేలపై చిత్రించారు. ఏటూరులో విద్యార్థులు సంప్రదాయ వేషధారణలు, స్వాతంత్ర సమర వీరుల గాథను బుర్రకథగా చెప్పారు. ఓబులాయిపల్లి నూతక్కి వారి కండ్రిక మొదలైన పాఠశాలల్లో జానపద నృత్యాలతో విద్యార్థులు అలరించారు.

# ఎమ్మార్పీఎస్ జెండాలు నిర్మించాలి

**కనిగిరి కో ఇంచార్జ్ జేపి రాజ్ మాదిగ**




(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, జులై 25)

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ ఎమ్మార్పీఎస్ జెండాలు నిర్మించాలని కనిగిరి కో ఇంచార్జ్ జేపి రాజ్ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్ద చెర్లోపల్లి గ్రామంలో సిఎస్ పురం మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బలభద్ర శీను మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు నేదర్ పల్లి బెంజిమెన్ మాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు పెద్ద చెర్లపల్లి గ్రామంలో గ్రామ పెద్దల చేతుల మీదగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా కనిగిరి ఎమ్మార్పీఎస్ కోఇంచార్జ్ జేపీ రాజు మాదిగ హాజరయ్యారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల లక్ష్యం ఎస్సీ వర్గీకరణ తీర్పు అతి త్వరలోనే రాబోతున్న సందర్భంగా ప్రస్తుతం మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు అన్ని గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాలు నిర్మించుకోవాలని గ్రామ కమిటీలు, మండల నిర్మాణంతో పాటు జండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఆగస్టు నెలాఖరుకల పూర్తి చేయాలని కోరారు. మాదిగ జాతి లక్ష సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిలో నిమగ్నం అవ్వాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నేదర్ పల్లి పోలయ్య మాదిగ, గొల్లపల్లి దేవ సహాయం , నాదర్పల్లి వెంకటయ్య, గొల్లపల్లి అంకయ్య, ఇమ్మానియేలు, మామిడి పుల్లయ్య, అంగలకుర్తి ఇమ్మానియేల్ మాదిగ, దేవ మాదిగ, వెంకటయ్య మాదిగ, వెంకటాద్రి, గొల్లపల్లి ఏసేపు, నేదర్ పల్లి డానియలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 104 సేవలను సద్వినియోగం చేసుకోండి

**మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి**



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 25)

పామూరు మండల పరిధిలోని ఇన్నిమెళ్ళ గ్రామంలో గురువారం 104 సేవలను వినియోగించుకోవాలని లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు గ్రామంలోని డాక్టర్ హరిబాబు ఆధ్వర్యంలో సుమారు వందమంది ఈ వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ 104 సేవలను అందరు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ హరిబాబు, డీఈఓ రాజమోహన్, ఏఎన్ఎం శ్రీదేవి, ఎమ్మెల్యే పి ప్రియాంక, రమేష్, టొబాకో బయ్యర్ శృతినేని జగ్గయ్య, ఒంటి పెంట కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు పరిధిలో నేషనల్ హైవే పై ఫ్లైఓవర్లు, వెహికల్ అండర్ పాస్‌లు ఎప్పటికి పూర్తవుతాయి..?

**లోకసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలు**



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 25)

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు లోక్‌సభలో నెల్లూరు పరిధిలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేయాల్సిన వెహికల్ అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్లపై ప్రశ్నలు వేశారు. గొలగమూడి జంక్షన్, చింతారెడ్డిపాళెం జంక్షన్ , బుజబుజ నెల్లూరు వద్ద రెండు వెహిక్యులర్ అండర్ పాసులు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి 2019లో ఎన్‌హెచ్ఏఐ ద్వారా ఏదైనా ప్రతిపాదన ఉందా, ఉంటే దాని వివరాలు తెలియజేయాలన్నారు. అలాగే ఎన్‌హెచ్ఏఐ సర్వే పూర్తి చేయడంలో జాప్యానికి గల కారణాలు, సర్వేలు పూర్తయ్యే సమయం, ఎన్‌హెచ్ఏఐ, డీపీఆర్‌వో ప్రారంభించే సమయం మరియు పూర్తయ్యే తేదీలను తెలపాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారి ప్రశ్నలకు కేంద్ర రోడ్డు, రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. గొలగమూడి జంక్షన్ వద్ద వెహిక్యులర్ అండర్ పాస్(వియుపి), నెల్లూరు టి-జంక్షన్ వద్ద ఫ్లైఓవర్, సుందరయ్య కాలనీ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అలాగే చింతారెడ్డిపాళెంలో వీయూపీ నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదన లేదని కేంద్ర మంత్రి వివరించారు.



# అండగుండాల్లో తాగునీటి కొరత

**గుక్కెడు మంచినీళ్ల కోసం అల్లాడుతున్న దళితవాడ**

**పట్టించుకోని అధికారులు పాలకులు**

(షణ్ముఖ వెలుగు, తడ, జులై 25)



మండల పరిధిలోని అండగుండాల గ్రామంలో గత వారం రోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడింది. గుక్కెడు మంచినీళ్ల కోసం దళితవాడ, ప్రజలు గిరిజను అల్లాడుతున్నారు. గొంతు ఎండుతున్న తమగోడు అధికారులు పట్టించుకోవడంలేదని, దళితుల సమస్యలు అధికారులు పట్టించుకోరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి త్రాగునీరు అందిస్తున్న మోటార్ పంపు చిన్నపాటి సమస్య ఏర్పడింది మరమ్మత్తులు చేసేందుకు పంచాయతీలో నిధులు లేవని గ్రామ సర్పంచ్ చేతులెత్తేశారు. గత ప్రభుత్వంలో వేసిన తాగునీటి పైప్ లైన్ కేవలం ఒక అడుగు లోతు లోడ్ చేశారు. అందువల్ల గ్రామంలోని మిట్ట ప్రాంతంలోని ఉన్న కొన్ని ఇళ్లకు మీరు అందడం లేదు. గత వారం రోజుల నుంచి తాగునీటి సమస్య ఏర్పడిన సమస్య పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో మాత్రం ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి గ్రామానికి త్రాగునీరు అందిస్తున్నామని, మండల పరిధిలో తాగునీటి సమస్య ఎక్కడా లేదని నివేదిక చదివి వినిపిస్తున్నారు. ఈ నివేదిక గ్రామస్థాయిలో అమలు కావడం లేదు. కనీసం గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా ప్రజల దాహం తీర్చవచ్చు. అలా కూడా అధికారులు ఎక్కడా చర్యలు తీసుకోలేదు గ్రామస్థాయిలో ప్రభుత్వ అధికారులు ఉన్న అంటి ముట్టునట్టుగా వ్యవహరిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పైన మౌలిక వసతులపైన ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు విరుద్ధంగా అధికారులు సమస్యల పరిష్కరించడంలో వెనుకడుగు వేస్తున్నారు. అధికారుల తీరు ఇలాగే కొనసాగితే ప్రభుత్వానికి ప్రజల్లో చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంది. ఇక నైనా మండల అభివృద్ధి అధికారి చర్యలు తీసుకోవాలని, ఖాళీ నీటి బిందెలతో రోడ్డు ఎక్కక ముందే సమస్యను పరిష్కరించాలని అండగుండాల గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

## ఓడిఎఫ్ ప్లస్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

### వెలిగండ్ల ఎంపీడీవో రామచంద్రరావు



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, జులై 25)

మండలంలోని రామగోపాలపురం సచివాలయ పరిధిలో ఓడిఎఫ్ ప్లస్ సర్వే కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్. రామచంద్రరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఏ విధంగా ప్రజలకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓడిఎఫ్ ప్లస్ సర్వేను త్వరగా పూర్తిచేయాలని పూర్తి చేయని సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ

### టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 25)

మండలంలోని దరిమడుగు గ్రామంలో రైతు సేవ కేంద్రంలో గురువారం ప్రభుత్వం నుంచి రైతులకు సరఫరా చేసిన పశుగ్రాస విత్తనాలు పిసి సిక్స్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులందరూ కూడా ఈ యొక్క అవకాశాన్ని వినియోగించు కోవాలని పశువులకు ఇబ్బందులేకుండా పశుగ్రాస విత్తనాలు తీసుకొని పంటను పండించి పశువులకు మేతకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఇడుపూరు గ్రామీణ పశువైద్యశాలలో పనిచేస్తున్న జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.అనిత మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు వాటికి టీకాల గురించి గేదలు మేతకు వెళ్ళినప్పుడు హైవే రోడ్డు పక్కనే ఉన్న కరెంటు స్తంభాల దగ్గరికి వెళ్లకుండా రైతులకు తగు జాగ్రత్తలు సూచించారు ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు అనిల్ నాయక్, దరిమడుగు టిడిపి నాయకులు జవ్వాజి కృష్ణారెడ్డి, నల్లారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లెబోయిన ఎర్రయ్య, గుమ్మ రాముడు, గుమ్మ గంగరాజు (డీలర్), గుమ్మ బాలరాజు, కుందుర్తి శంకరాచారి, తదితరులు పాల్గొన్నారు.


## ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా కె దాసు



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 25)

దోర్నాల తహసీల్దార్‌గా ఎన్నికల ముందు నుంచి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఎస్ఎం హమీదును తన సొంత జిల్లా అయిన నెల్లూరుకు బదిలీ చేశారు. పెద్దారవీడు మండల తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కే దాసును పెద్ద దోర్నాల ఇంచార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. దోర్నాల ఇంచార్జ్ తహసీల్దార్‌గా కే దాసు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా పెద్ద దోర్నాల ఇంచార్జ్ తహసీల్దార్‌గా నియమితులైన కే దాసును రెవెన్యూ అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా బదిలీ పై నెల్లూరు జిల్లాకు వెళ్తున్న ఎస్ఎం హమీద్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు రామయ్య, ఆనందరావు, వెంకటయ్య, శ్రీనివాసులు, రవికుమార్, సునీత, ఎస్తేరు రాణి, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో మైనార్టీలను విస్మరించిన మోడీ



### కేటాయింపుల్లో వాతలు, కోతలు
### సబ్ కా సాత్ - సబ్ క వికాస్ అంటే ఇదే నా మోడీ
### ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)

కేంద్ర బడ్జెట్ కేటాయింపులలో ముస్లిం మైనార్టీలకు, ఇతర మైనార్టీ వర్గాలపై మోడీ తనసహజ సిద్ధ వైఖరితో వివక్షత చూపారని, మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని అనేక పథకాలకు వాతలు, కోతలు విధించి దేశంలోని 142 కోట్ల మంది జనాభాలో దాదాపు 30 కోట్ల మంది మైనార్టీ ప్రజలను తీవ్రంగా మోసం చేశారని జనాభా దామాషా పద్ధతిలో బడ్జెట్ కేటాయింపులు జరగలేదనీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సైదా గురువారం పొదిలిలో కేంద్ర బడ్జెట్ గూర్చి పాత్రికేయులతో ముచ్చటిస్తూ అన్నారు. దేశంలోని మైనార్టీలు అధిక సంఖ్యలో నివసించే దాదాపు 1300 ప్రాంతాలలో అభివృద్ధి లోటు పూడ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ప్రధానమంత్రి జన వికాస్ (పీఎంజెవికె) పథకానికి బడ్జెట్ లో జరిగిన కేటాయింపులే! మైనార్టీల పట్ల వివక్షతకు దర్పణం పడుతున్నాయని, మోడీ 2014లో తన మొదటి బడ్జెట్ ,ఇప్పటి బడ్జెట్ లో మైనార్టీ మంత్రిత్వ శాఖకు కేటాయించిన నిధుల కేటాయింపు చూసుకున్నట్లయితే దాదాపు 20 శాతం కు పైగా కోతలే! విధించారని సైదా తీవ్రంగా విమర్శించారు. మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజజ్ కేంద్రబడ్జెట్ "అన్ని వర్గాల కలల బడ్జెట్'గా పేర్కొనడం హాస్యాస్పదం,నైపుణ్య అభివృద్ధి, జీవనోపాధి పథకాలకు గత ఏడాది రూ. 64.4 కోట్లు తో పోలిస్తే ఈఏడాది కేవలం రూ 3.కోట్లు కు తగ్గించారని, నేషనల్ మైనార్టీ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు గత బడ్జెట్లో రూ 61. కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఫ్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ పథకం గత ఏడాది కేటాయించిన రూ. 433 కోట్లతో పోలిస్తే రూ. 326 కోట్లకు తగ్గిందని, మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ పథకానికి గత ఏడాది రూ 96. కోట్లు కేటాయిస్తే ఈసారి సగానికి తగ్గించి రూ 45. కోట్ల కేటాయించడం నీతిమాలిన చర్య అని "సబ్ కసాత్- సబ్ కా వికాస్" అంటే ఇదే !నా మోడీ అని సైదా తీవ్రంగా మండిపడ్డారు. ఉచిత కోచింగ్ ,అనుబంధ పథకాలకు గత బడ్జెట్లో 30. కోట్ల కేటాయిస్తే ఏడాది 10. కోట్లు మాత్రమే కేటాయిం చిందని, జాతీయ మైనార్టీ కమిషనకుబడ్జెట్లో రూ 1. కోటికి తగ్గించారని బడ్జెట్లో పేదలను, రైతులను, కార్మికులను, శ్రామికులను పూర్తిగా విస్మరించారని, ఇది మోడీ బచావో బడ్జెట్ అని, ధరల పెరుగుదల గురించి, ఏపీకి ప్రత్యేక హోదా గురించి, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల గురించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దుర్మార్గమైన చర్యని, అమరావతి నిర్మాణానికి కేటాయించిన 15 వేల కోట్ల రూపాయల కూడా అప్పుగా ఇవ్వడం సమంజసం కాదని, ఇప్పటికే రాష్ట్రం దాదాపు 14 లక్షల కోట్ల పైగా అప్పులు ఊబిలో కూరుకు పోయిందని, డబల్ ఇంజన్ సర్కార్ అంటే ఇదేనా మోడీ అని కాంగ్రెస్ పార్టీ నేత షేక్ సైదా తీవ్రంగా విమర్శించారు.

# వికసిత ప్రకాశం జిల్లా లక్ష్యంగా బిజెపి

### వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం ను చేర్చడంలో బిజెపి రాష్ట్ర కమిటీ పూర్తిగా సఫలం
### జిల్లాలోని దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్, కనిగిరి లోని నిమ్జ్ పనులు వేగవంతం
### పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు పెంపుకు అనుకూల పరిణామాలు
### ఒంగోలులో ప్రతి రోజు తాగునీటికి అమృత్-3
### వెనుకబడిన మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం
### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

వికసిత ప్రకాశం జిల్లా లక్ష్యంగా బిజెపి పని చేస్తుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ఒంగోలులోని హోటల్ సరోవర్ లో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు అధ్యక్షతన బిజెపి మీడియా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దినకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గతంలో ఎన్నడు లేని విధంగా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అంతేగాక వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాలో చేర్పించడంలో బిజెపి రాష్ట్ర కమిటీ పూర్తిస్థాయిలో సఫలం అయిందన్నారు. వికసిత ప్రకాశం జిల్లాతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది అన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు బాధ్యతాయుతంగా జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించి నిధులు రాబట్టుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. తమ వద్ద ఉన్న సమాచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోయి జిల్లాతో పాటుగా రాష్ట్ర అభివృద్ధి డబుల్ ఇంజన్ రైలు స్థాయిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. జిల్లాలో నిలిచిపోయిన దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్, కనిగిరి నిమ్జ్, తో పాటుగా ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందించే దిశగా అమృత్ 3 నిధులు రాబట్టుకునేందుకు ఇదే సరైన సమయమన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయటం ద్వారా దొనకొండ ఇండస్ట్రియల్ క్యారీడారుకు, కనిగిరి ని మ్జ్ కు నీరు అందించడమే కాకుండా, భూగర్భ జలాలు పెంపుకు ఎంతో దోహదపడుతుందన్నారు.

అంతేకాకుండా రానున్న కాలంలో ప్రధానమంత్రి నివేశిత యోజన పథకంలో భాగంగా జిల్లాలో పేదలకు మరిన్ని గృహాలు ఏర్పాటు చేసుకోవచ్చు అన్నారు. మరో ఐదు సంవత్సరాలు పాటు ప్రతి ఇంటికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధిలో భాగంగా మార్కాపురం కేంద్రంగా పశ్చిమ ప్రకాశం జిల్లా ఏర్పాటుకు బిజెపి కట్టుబడి ఉందన్నారు. తూర్పు ప్రకాశం జిల్లాలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గం కలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోతామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ గా అభివర్ణించారు. రాష్ట్రంలో రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం అవుతాయని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ పివి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి మోజి, తానికొండ సురేష్, శిరీష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏబీఎం ఆస్తులకు పోరాటం ఉధృతం

### ఎంబిఎఫ్ఏ ప్రెసిడెంట్ జె.దేవానందం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 25)

ఎబిఎం ఆస్తులకు పోరాటం ఉధృతం చేస్తామని మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.దేవానందం పేర్కొన్నారు. గురువారం ఉదయం మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ని కలిసి ఎ బి ఎం ఆస్తులను కాపాడాలని, ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. దురాక్రమణలు తొలగించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ లో ఉన్న 6 మండలములోని 42 బాప్టిస్ట్ సంఘముల ప్రతినిధులు అందరూ కలిసి రావాలని కోరారు. ఈ సందర్భంగా సంఘములో లేక ఖాళీగా ఉన్న క్వాలిఫైడ్ అయిన పాస్టర్లు అసోసియేషన్ లో దరఖాస్తు చేసుకోవాలని, కాపరి లేక ఖాళీగా ఉన్న బాప్టిస్ట్ సంఘములోని సంఘ పెద్దలు కాపరి నియామకం కొరకు అసోసియేషన్ కు వినతి పత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు. తద్వారా అన్ని సంఘములకు సంఘ కాపరులను కేటాయించడం జరుగుతుందన్నారు. అందరం కలిసి ఎబిఎం ప్రాపర్టీని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎబిఎం ఆస్తులను కాపాడే విషయంలో మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి చిన్న కాశయ్య, ట్రెజరర్ జెడ్డా పీటర్, లీగల్ అడ్వైజర్ చిలక చక్రవర్తి, బూదాల ప్రేమ్ కుమార్, సిగా రాజు పాల్, విల్సన్, సంద్రపాటి జాన్, పాస్టర్లు మున్నంగి జార్జి బాబు, పసుమర్తి సామ్యేల్, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





## మందల శ్రీహరి మృతిపై సోమిరెడ్డి దిగ్భ్రాంతి




(షణ్ముఖ వెలుగు, వెంకటాచలం, జులై 25)

మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ గొట్లపాళెంకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మందల శ్రీహరి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంపై సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీహరి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన శ్రీహరి హఠాత్తున ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. శ్రీహరి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూరాలని, భగవంతున్ని ప్రార్థిస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు.

## వీఆర్‌ఏల నూతన కమిటీ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 25)

మండల కేంద్రంలో వీఆర్‌ఏల నూతన కమిటీని ఎన్నుకున్నారు. పూర్ణ కంటి యాకోబు - ప్రెసిడెంట్, ఇట్టే నారాయణ-వైస్ ప్రెసిడెంట్, గంపల చిన్న గురవయ్య-సెక్రెటరీ, దూదేకుల పెద్ద కాశయ్య-ట్రెజరర్, భూమిని నాగేశ్వరరావు-అసోసియేట్ ప్రెసిడెంట్, తోకల వెంకటేశ్వర్లు-జాయింట్ సెక్రెటరీ, దర్శనం పోలయ్య-అడ్వైజర్, సింగా రఘు-అడ్వైజర్, యలకపాటి రవి-నెంబర్, ఉదర ప్రభుదాసు-నెంబర్ గా నూతన కమిటీని ఏర్పరచుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పూర్ణకంటి యాకోబు మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుండి వీఆర్‌ఏల సమస్యలు ఉన్నాయని, సమస్యలపై సమిష్టిగా పోరాడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వీఆర్‌ఏలు పాల్గొని కమిటీ ఎన్నికలను జయప్రదం చేశారు.

## వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ

### రైతు స్ఫూర్తి సీఈఒ వై బాలచంద్ర



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 25)

ఉలవపాడు గ్రామ పరిధిలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల చినలేటిరిపి చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలో నిర్మించ బడి ఉన్న సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నందు విద్యార్థుల తరగతుల్లో భాగమైన ఉద్యానవన పంటలు విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీ విధానం గూర్చి గురువారం నాడు శిక్షణా కార్యక్రమం కొరకు తీసుకుని వెళ్ళడం జరిగినది. రైతు స్ఫూర్తి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వై బాలచంద్ర విద్యార్థిని, విద్యార్థులకు అన్ని రకాల పండ్లు కూరగాయలు, ఆకుకూరలు వ్యాల్యుఎడిషన్ చేయడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది, మార్కెట్ లో మంచి ధర పలకడమే గాక ఈ పదార్థాలు విదేశీ ఎగుమతులకు కూడా మంచి అవకాశం ఉంది అని క్షుణంగా వివరించుట జరిగింది. విద్యార్థులు చదువు అనంతరం వారు సమయం ఉపాధికల్పనకు ప్రోత్సహించాడు విద్యార్థులు కూడా మంచి ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమం ఉద్యాన కళాశాలకు చెందిన ఉప సహాయక ఉపాధ్యాయురాలు యస్ యం శైలజ ఆధ్వర్యంలో నిర్వహించ బడింది.

## ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 25)

సచివాలయంలోని సీఎం ఛాంబర్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని గురువారం యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యల పై ఆయన చంద్రబాబునాయుడుకు వివరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, సంక్షేమ హాస్టళ్ళు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. సమస్యల పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గూడూరి తెలిపారు.

# గిద్దలూరి ప్రశాంత్‌కు అమెరికా హెచ్.ఎస్.సి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం



(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, జులై 25)

గిద్దలూరి ప్రశాంత్ అమెరికా హెచ్.ఎస్.సి యూనివర్సిటీ నుంచి గురువారం డాక్టరేట్ అందుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తన అంబులెన్సులో వేగంగా వారిని అతి తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో హాస్పిటల్స్ తీసుకుని వెళ్ళి ఎంతో మంది ప్రాణాలు కాపాడిన ప్రశాంత్ సేవలను గుర్తించిన అమెరికాకు చెందిన హెలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ (హెచ్.ఎస్.సి) యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో యూనివర్సిటీకి చెందిన శాఖ భవనంలో జి ప్రశాంత్‌కు యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్ సత్కరించి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నేటి యువకులు ప్రశాంత్‌ను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జి ప్రశాంత్ మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో బయట తిరిగే క్రమంలో రోడ్డు ప్రమాదంలో ఉన్న వారిని చూసి తనకు వచ్చే కొద్ది పాటి ఆదాయం ఏదో ఒకటి చేయాలి అనే ఆలోచన మొదలైందన్నారు. ఈ కార్యక్రమలు తన ఫ్రెండ్స్ సోషల్ మీడియాలో వైరల్ చేశారని, అది గుర్తించిన హెచ్.ఎస్.సి యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ దక్కడం సేవా కార్యక్రమాల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు. గౌరవ డాక్టరేట్ రావడా నికి సహకరించిన యూనివర్సిటీకి, సెలక్షన్ కమిటీకి, అవార్డు అందించిన పెద్దలకు, తాను చేస్తున్న సేవా కార్యక్రమలకు సహకరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు డాక్టర్ గిద్దలూరి ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

# చాత్రోపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్ పై అవగాహన సదస్సు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 25)

జిల్లా విద్యా శిక్షణ సంస్థ, మైనంపాడు నందు ఛాత్రోపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్, స్కిన్ డెవలప్మెంట్ పై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా సంస్థ ఇన్చార్జి ప్రధానాచార్యులు సామా సుబ్బారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ మరియు డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరైరి. సభాధ్యక్షులైన సామా సుబ్బారావు మాట్లాడుతూ సంస్థలో అందరు చాత్రోపాధ్యాయులు డిజిటల్ ఎడ్యుకేషన్ పై అవగాహన కలిగి ఉండాలని, అలాగే తమలో ఉండే నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని తెలియజే యడం జరిగింది. అనంతరం డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ మాట్లాడుతూ చాత్రోపాధ్యాయులు తప్పనిసరిగా డిజిటల్ ఎడ్యుకేషన్ పై అప్డేట్ గా ఉండాలని అలా ఉండని పక్షంలో డిజిటల్ గా వెనకబడిపోతారని అలాగే ప్రతి ఒక్కరూ ఎంప్లాయిమెంట్ సైట్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ నాయక్ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యా యులకు నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో ఎప్పటికప్పుడు ఎలా అప్డేట్ చేసుకోవాలో జీవితంలో ఉన్నత శిఖరాలను ఎలా అధిరోహించాలో చక్కగా వివరించి ఛాత్రోపాధ్యాయులతో ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది. తరువాత చాత్రోపాధ్యాయులు అడిగిన సందేహాలకు తగు ఉదాహరణల ద్వారా సందేహ నివృత్తి గావించిరి. తదుపరి సంస్థలోని అధ్యాప కులు ఆర్.శ్రీనివాసులు, ఎం. రవీంద్ర ప్రసాద్ చాత్రోపాధ్యాయుల నుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఇరువురు అతిథులను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. జాతీయ గీతాలాపనతో ఈ కార్యక్రమాన్ని ముగించడం జరిగింది.

# టాగూర్ సాంస్కృతిక సముదాయాల పనితీరుపై మాగుంట ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

దేశంలోని ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ టాగూర్ సాంస్కృతిక సముదాయాల ప్రస్తుత వాటి పనితీరు, క్రొత్త వాటి ఏర్పాటు, అథారిటీ నియామకం గురించి ప్రభుత్వ చర్యల పై ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత శాఖ (స్వతంత్ర) సహాయక మంత్రి, గజేంద్ర సింగ్ షెఖావత్ సమాధానం ఇచ్చారు. ఈ పథకం క్రింద సంగీతం, నృత్యం, నాటకం, సాహిత్యం, లలిత కళలు మొదలగు సాంస్కృతిక రంగాలలో ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంతో ప్రవేశపెట్టబడిందన్నారు. దేశంలో ఈ పథకం కింద గత ఐదేళ్లలో రాష్ట్రాల నుంచి 26 టాగూర్ సాంస్కృతిక సముదాయాల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయని, అందులో ఆర్థిక సాయం పొందినవి 8 పనిచేస్తున్నాయన్నారు. తిరుపతిలో దీని ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చిన ప్రతిపాదనలు సిఫార్సు చేసి ఆమోదించవల్సి ఉందన్నారు. ఈ పథకం క్రింద ప్రస్తుతం వున్నరబీంద్ర భవనాలను పునరుద్దరణ, పునర్నిర్మాణం, స్థాయి పెంపు, ఆధునీకరణ, విస్తరణ వంటి పనులు, రాష్ట్రాల రాజధానులలో, ముఖ్య పట్టణాలలో క్రొత్తవాటి నిర్మాణం చేయబడునని తెలిపారు. పూర్తి ప్రతిపాదనలతో వచ్చిన ప్రాజెక్టులను మాత్రమే మంత్రిత్వ శాఖ పరిగణలోకి తీసుకొంటుందని, ఉప కమిటీ సాంకేతిక పరిశీలన అనంతరం వాటిని జాతీయ మూల్యాంకన కమిటీ ఆమోదించునని తెలిపారు. వీటి ఏర్పాటు, పనితీరు పై ఒక అథారిటీ నియామకంపై ఎలాంటి ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గర లేవని, కాని భౌతిక తనిఖీలు చేసేందుకు ఈ పథక మార్గదర్శకాలు ఉపయోగపడునని కేంద్ర మంత్రి తెలిపారు.

# వసతి గృహ విద్యార్థులకు మ్యాట్ల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, జులై 25)

వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని చదువుకోవాలని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్, వసతి గృహ అధికారి సురేంద్రలు అన్నారు. గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని 80 మంది విద్యార్థులకు చెన్నైలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వీరపనేని నవీన్ ఆర్థిక సహకారంతో మ్యాట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా వసతిగృహ సంక్షేమ అధికారి సురేంద్ర మాట్లాడుతూ స్టూడెంట్ వాలంటీర్‌గా వీరపనేని నవీన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. నవీన్ను ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థినీ, విద్యార్థుల చేయూతకు దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం సేవా ధృక్పధంతో మ్యాట్లు అందజేసిన నవీనన్ను గుడెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్బాబు, వార్డెన్ సురేంద్ర, స్థానిక నాయకులు వేమూరి రామయ్య, గుంటగాని జోసేఫ్, బద్దిపూడి ఎబినేజరు, దేవండ్ల బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

# కేంద్ర బడ్జెట్ పై సిపిఎం ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిరసన



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 25)

నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన ఆందోళన చేపట్టారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు దేశం ప్రజా అవసరాలకు ఏమాత్రం ఉపయోగం లేదని కేవలం కార్పొరేట్ల కు వారి అభివృద్ధికి దోహదపడే విధంగా మాత్రమే ఈ బడ్జెట్ కేటాయించారని, సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలుపుతూ నిరసన తెలిపారు. రాష్ట్ర విభజనకు గురై ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ కేంద్ర బడ్జెట్ ద్వారా ఒరిగింది ఏమీ లేదని అమరావతి అభివృద్ధి కోసం అంటూ ఇచ్చిన నిధులు అప్పుగా ఇస్తున్నామని దానికి కూడా వడ్డీలు లెక్కలు చెప్పి మరీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధి విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు పార్టీ సానుభూతిపరులు స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలి

## ముంపు గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరితగతిన ఇప్పించాలి
## మంత్రులను కోరిన వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 25)

మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన పలు సమస్యలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టపాటి రవికుమార్‌ను ఆయా శాఖల సమస్యలపై వినతి పత్రాన్ని యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన సుంకేసుల,కలనుతల గుండంచర్ల గ్రామాలలో ప్రజలకు తాత్కాలికంగా సౌకర్యాలు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో పాటు వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి ముంపు గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ప్యాకేజీ త్వరితగతిన ఇప్పించాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలంగా కావాలంటే తప్పనిసరిగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని వారు విన్నవించుకున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పలు రకాల పనులకు నిధులు విడుదల చేయాలని వారు దృష్టికి తీసుకెళ్లారు. ముంపు గ్రామ ప్రజలకు నిర్మిస్తున్న కాలనీలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రులకు తెలియజేశారు. మంత్రులు సానికూలంగా స్పందించి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ మండల పార్టీ కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ అనుముల ప్రసాదు, ఎంపీటీసీ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, అనుముల రోశయ్య, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

# లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

## న్యాయ సేవాధికార సంస్థ




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 25)

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కనిగిరి ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం అన్నారు. కనిగిరి డివిజన్ కేంద్రమైన కనిగిరిలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ వైద్యశాల నందు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి.సి, పి.ఎన్.డి.టి యాక్ట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులపై, ప్రోత్సహించినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ విషయంలో దోషులు ఎంతటివారైనా ఉపేక్షించరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో "సేవ్ గర్ల్ చైల్డ్" అనే అంశంపై చర్చించడం జరిగింది. గైనకాలజిస్ట్ డాక్టర్ రోషితా రెడ్డి మాట్లాడుతూ రిజిస్టర్ లేని స్కాన్ సెంటర్స్ ను తొలగించాలని తొలగించని ఎడల స్కాన్ సెంటర్స్‌పై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న "బేటి బచావో బేటి పడావో" కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలు, ఎన్‌జిఒల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించి ఆడపిల్ల శిశు మరణాలు తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సారెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ యం రమేష్ బాబు, జిఎస్ అండ్ జి.డి.కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి.నవకుమార్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రూ.56 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు


## రూ.25 లక్షలు సొసైటీ మంజూరు చేయగా, రూ.31 లక్షలు మంజూరు చేసిన కలెక్టర్



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 25)

నాయుడుపేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రూ.56 లక్షలతో పాఠశాలలోని అన్ని పనులను పూర్తిచేయాలని తలచారు. అందులో భాగంగా డార్మెంటరీలోని టాయిలెట్స్ ఫుల్ షేపులో తయారు చేయాలని బాత్రూంలో టైల్స్, బేసిన్, హ్యాండ్ వాష్, ట, డోర్స్, వెంటిలేటర్స్, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ వర్క్స్ జరుగుతున్నాయి. డైనింగ్ హాల్‌లో డామేజ్ అయిన 12 కిటికీలను రిపేర్ చేయాలని అలాగే ఫ్యాన్లు లైట్లు రిపేరు చేస్తున్నారు. కిచెన్లో ఫ్లోరింగ్ వర్క్, కొత్త డార్మెంటరీలోకి వెళ్లే దారిలో ర్యాంప్ నిర్మాణం కూడా జరుగుతున్నది. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు వేగవంతంగా సమకూర్చడం వల్ల అభివృద్ధి పనులు జరుగుచున్నవి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించడం లో మన కలెక్టర్ కృషి హర్షనీయం అని ప్రిన్సిపల్ తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలి



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జులై 25)

యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా సంఘాల పిలుపు మేరకు విద్యా రంగంలో నెలకొన్న సమస్యలైన 117 జీవో రద్దు, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని, తదితర 20 ప్రధాన సమస్యలను సత్వరం పరిష్కారం చేయాలని కోరుతూ గురువారం చేజర్ల మండల విద్యాశాఖ అధికారి-2 డీసీ మస్తానయ్యకు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ చేజర్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, నాగినేని రమణయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య, సునీల్ కుమార్, శ్రీరాములు, పోలయ్య, వెంకట్రావు, షరీఫ్, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com